




# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

బుధవారం,
నవంబరు 12, 2025

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-


# ముగిసిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్..





**క్యూలో ఉన్న వారికి ఓటు వేసేందుకు అవకాశం**

**మాగంటి గోపీనాథ్ అకాల మృతితో ఉప ఎన్నిక**

**ఈనెల 14న ఓట్ల లెక్కింపు.. బరిలో 58మంది అభ్యర్థులు**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ ముగిసింది. పోలింగ్ కేంద్రాల వద్ద గేట్లు మూసివేశారు. సాయంత్రం ఆరు గంటల వరకు క్యూ లైన్‌లో ఉన్న ఓటర్లకు ఓటు వేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు. 2023లో బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణంతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఓట్ల లెక్కింపు ఈ నెల 14న జరగనుంది. జూబ్లీహిల్స్ బరిలో మొత్తం 58 మంది అభ్యర్థులు నిలిచారు. ప్రధానంగా బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్య హోరాహోరీ పోరు నెలకొంది. బీఆర్ఎస్ నుంచి మాగంటి గోపీనాథ్ భార్య మాగంటి సునీత, కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్, బీజేపీ నుంచి లంకల దీపక్ రెడ్డి పోటీ చేశారు. గెలుపుపై ఆయా పార్టీల అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

**ఆరుగురు మావోయిస్టుల మృతి**

భద్రతా బలగాలకు, మావోలకు మధ్య ఎదురుకాల్పులు

బీజాపూర్ జిల్లాలోని దట్టమైన అటవీ ప్రాంతంలో ఘటన

భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం

మావోయిస్టుల ఉనికి తగ్గిందన్న బస్తర్ రేంజ్ ఐజీ

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. బీజాపూర్ జిల్లాలోని దట్టమైన అటవీ ప్రాంతంలో మంగళవారం భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన భీకర ఎదురుకాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు

- మిగతా 2వ పేజీలో

## ఢిల్లీ పేలుడు కేసును ఎన్ఐఏకి

**ఈ ఘటనలో 13కి చేరిన మృతుల సంఖ్య, 25 మందికి గాయాలు**

పేలుళ్లకు పుల్వామాతో సంబంధాలున్నట్లు అనుమానాలు

కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఉన్నతస్థాయి భద్రతా సమీక్ష

సూత్రధారులను వదిలిపెట్టబోమని స్పష్టం చేసిన ప్రధాని మోదీ

రాజధాని వ్యాప్తంగా హై అలర్ట్, భద్రత కట్టుదిట్టం




దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన కారు బాంబు పేలుడు కేసు దర్యాప్తును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారికంగా స్వీకరించింది. ఈ దుర్ఘటనలో మృతుల సంఖ్య 13కి పెరిగింది. మరో 25 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. పేలుడు ఘటన సూత్రధారులను వదిలిపెట్టబోమని, దర్యాప్తు సంస్థలు ఈ కేసు మూలాల్లోకి వెళ్లి నిందితులను పట్టుకుంటాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

- మిగతా 2వ పేజీలో

### ఢిల్లీ బాండు పేలుడు దోషులపై

## కఠిన చర్యలు

**కుట్రకారులను వదలే ప్రసక్తే లేదు: మోదీ**

ముష్కరులను చట్టం ముందు నిలబెడతాం

ఎట్టి పరిస్థితుల్లో తప్పించుకోలేరు ప్రధాని హెచ్చరిక

ఢిల్లీ పేలుడు బాధితులకు సంతాపం



థింపూ: ఢిల్లీలో జరిగిన కారు బాంబు పేలుడు ఘటనపై స్పందించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, దానికి బాధ్యులైన కుట్రదారులు ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పించుకోలేరని తేల్చిచెప్పారు. వారిని చట్టం ముందు నిలబెట్టి, తగిన శిక్ష విధిస్తామని స్పష్టం చేశారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన నిరపరాధులపై దాడి చేసిన వారిని తప్పక శిక్షిస్తామని

- మిగతా 2వ పేజీలో

## విదేశీ విద్యార్థులకు అమెరికాలో ఎలాంటి అడ్డంకులు లేవు : ట్రంప్



## 'శిఖం' భూభాగంలో ఆలయ నిర్మాణానికి అనుమతిపై హైకోర్టు అసహనం

"చెరువు ప్రాంతంలో నిర్మాణానికి కలెక్టర్ ఎలా అనుమతి ఇచ్చారు?"

ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు



# అందెశ్రీ పాడె మోసిన రేవంత్

**ఘట్‌కేసర్‌లో ముగిసిన అందెశ్రీ అంత్యక్రియలు**



**అంతిమ సంస్కారాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరు**

**అందెశ్రీ లేకపోవడం తీరని లోటు అన్న ముఖ్యమంత్రి**

హైదరాబాద్, నవంబరు 11 : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ పాడెను మోశారు. అందెశ్రీ అంత్యక్రియలు హైదరాబాద్ నగర శివారులోని ఘట్‌కేసర్‌లో నిర్వహించారు. ఈ అంతిమ సంస్కారాలకు రేవంత్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. అంతిమ యాత్రలో అందెశ్రీ పాడెను రేవంత్ రెడ్డి మోశారు. తెలంగాణ ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు

- మిగతా 2వ పేజీలో




## జూబ్లీహిల్స్‌లో నాన్ లోకల్ నాయకులపై ఎన్నికలసంఘం ఆగ్రహం

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, రామచంద్ర నాయక్, ఎమ్మెల్సీ శంకర్‌లపై చర్యలకు ఆదేశం

# పోలింగ్ 48.47% మాత్రమే

మాత్రం కొంత ఉత్సాహం కనిపించింది. ప్రముఖులు, సినీ తారలు, అధికారులు మాత్రం ఉదయాన్నే తమ ఓటు హక్కును వినియోగించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నేతలు ఒకరిపై మరొకరు కోడ్ ఉల్లంఘన, బోగస్ ఓట్లు, ప్రలోభాల ఆరోపణలు చేసుకున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు బూత్‌లను సందర్శించి ఓటింగ్ పరిస్థితిని సమీక్షించారు. స్థానికేతర నేతలు తిరుగుతున్నారన్న ఫిర్యాదులపై ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేయగా, పోలీసులు పలువురిపై కేసులు నమోదు చేశారు. అదనంగా, 136 డ్రోన్లతో ప్రాంతమంతా పర్యవేక్షణ చేపట్టారు. కాంగ్రెస్ మరియు బీఆర్ఎస్ నేతల మధ్య అనేక బూత్‌ల వద్ద వాగ్వాదాలు, తోపులాటలు చోటుచేసుకున్నాయి. యూసుఫ్‌గూడలో బోగస్ ఓట్లు వేస్తున్నారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ అభ్యర్థి సునీత, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, కార్పొరేటర్‌తో కలిసి ఆందోళన చేపట్టారు. దీనిని కాంగ్రెస్ కార్యకర్తలు అడ్డుకోవడంతో ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. షేక్‌పేట్ డివిజన్‌లోని అపెక్స్ హైస్కూల్ బూత్, యూసుఫ్‌గూడ సవేర ఫంక్షన్ హాల్ వద్ద కూడా ఇలాంటి పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు లాఠీచార్జ్ చేయాల్సి వచ్చింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రతి బూత్‌కీ తిరుగుతున్నారంటూ బీఆర్ఎస్ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. శ్రీకృష్ణానగర్‌లోని ఏ బ్లాక్‌లో దొంగ ఓట్లు వేస్తున్నారన్న ఆరోపణలతో సునీత నిరసన చేపట్టారు. షేక్‌పేట్ అల్‌ఫల స్కూల్, సమత కాలనీ పోలింగ్ కేంద్రాల



వద్ద కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ నిరసన వ్యక్తం చేశారు. అక్కడికి చేరిన కాంగ్రెస్, మజ్లిస్ కార్యకర్తల మధ్య కూడా తోపులాట జరిగింది. దాసోజు శ్రవణ్, ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ బూత్ వద్ద ఉండడంపై కాంగ్రెస్ అభ్యంతరం తెలిపింది. తాజా సమాచారం ప్రకారం,

ఈ ఉప ఎన్నికల్లో 48.42 శాతం పోలింగ్ నమోదైంది. రెండు సంవత్సరాల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఈ శాతం 47.58 మాత్రమే. చివరి గంటల్లో ఉత్సాహం పెరిగినా, పోలింగ్ అంచనాలకు మించి జరగలేదు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు నెలల తరబడి ఇంటింటికీ ప్రచార కార్యక్రమాలు నిర్వహించి ఓటు హక్కు వినియోగించాలని పిలుపునిచ్చినప్పటికీ పెద్దగా ప్రభావం చూపలేదు. అధికార యంత్రాంగం అవగాహన కార్యక్రమాలు చేపట్టినా ప్రజలు పెద్దగా స్పందించలేదు.

# దోషులపై కఠిన చర్యలు



హెచ్చరించారు. దర్యాప్తు సంస్థలు లోతుగా విచారిస్తున్నాయని, త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడవుతాయని తెలిపారు. మంగళవారం ప్రధాని మోదీ భూటాన్ పర్యటనలో భాగంగా మాజీ రాజు జిగ్మే సింగ్యే వాంగ్‌చుక్ 70వ జన్మదినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. థింపూ నగరంలోని చాంగ్లిమేథాంగ్ స్టేడియంలో జరిగిన ఈ వేడుకలో ఆయన ప్రసంగించారు. థింపూ సభలో మాట్లాడిన మోదీ, ఢిల్లీ పేలుడు ఘటనలో ప్రాణాలు కోల్పోయిన సాధారణ పౌరుల మరణంపై గాఢ దుఃఖం వ్యక్తం చేశారు. "భారీ మనసుతో థింపూకి వచ్చాను. బాధిత కుటుంబాల బాధను నేను అనుభవిస్తున్నాను. దేశం మొత్తం మీతో ఉంది" అని అన్నారు. సోమవారం రాత్రంతా దర్యాప్తు అధికారులతో మాట్లాడినట్టు వెల్లడించారు. దర్యాప్తులో కీలక ఆధారాలు బయటపడుతున్నాయని, సమాచారం తాను నిరంతరం తెలుసుకుంటున్నానని చెప్పారు. భారత్%-%భూటాన్ మధ్య అనుబంధం శతాబ్దాలనాటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక బంధంతో ఉన్నదని మోదీ గుర్తు చేశారు. మాజీ రాజు జన్మదిన వేడుకల్లో పాల్గొనడం తనకు గౌరవకారణమని అన్నారు. భారత ప్రజల తరఫున భూటాన్ ప్రజలకు మరియు రాజవంశానికి శుభాకాంక్షలు తెలిపారు. భూటాన్ రాజ్యాంగ ప్రజాస్వామ్య రాచరికంగా ముందుకు సాగుతోందని, ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందని ప్రశంసించారు. "గ్రాస్ నేషనల్ హ్యాపినెస్" అనే ప్రత్యేక ఆలోచనతో దేశాన్ని నూతన దిశలో నడిపినందుకు వాంగ్‌చుక్‌ను కొనియాడారు. జిగ్మే సింగ్యే వాంగ్‌చుక్ నిరాడంబరత, ధైర్యం, ప్రజాసేవా తపనకు ప్రతీకగా ఉన్నారని మోదీ పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలపడటంలో, సరిహద్దుల్లో శాంతిని కాపాడటంలో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. అదే స్టేడియంలో భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నమ్‌గేల్ వాంగ్‌చుక్ ఆధ్వర్యంలో ఢిల్లీ పేలుడు బాధితుల కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వేలాది భూటాన్ పౌరులు పాల్గొన్నారు. రాజు, రాజ కుటుంబం బాధిత కుటుంబాలకు సంతాపం తెలిపారు. భూటాన్‌లో విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టుల అభివృద్ధి కోసం భారత్ రూ. 4,000 కోట్ల ఆర్థిక సహాయం ప్రకటించింది. రెండు దేశాల మధ్య ఇంధన సహకారమే ద్వైపాక్షిక సంబంధాల బలమైన పునాది అని మోదీ వివరించారు. భూటాన్ రాజు భారత్ సహకారాన్ని ప్రశంసిస్తూ, పునరుత్పాదక ఇంధనం, ఆరోగ్య సేవలు, మానసిక ఆరోగ్య రంగాల్లో మూడు కొత్త ఒప్పందాలు కుదిరినట్టు తెలిపారు. భూటాన్‌లోని గెలెఫూ, సామ్‌త్సే ప్రాంతాలను భారత రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానించనున్నట్టు మోదీ ప్రకటించారు. ఈ ప్రాజెక్టు ద్వారా భూటాన్ వ్యాపారులు, రైతులు భారత మార్కెట్లను సులభంగా చేరుకోగలరని తెలిపారు. "మన బంధం సరిహద్దులను మించి సంస్కృతుల అనుసంధానం" అని వ్యాఖ్యానించారు. మోదీ, భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నమ్‌గేల్ వాంగ్‌చుక్ మధ్య ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. ఇంధనం, సాంకేతికత, రక్షణ, అనుసంధానం వంటి కీలక రంగాల్లో సహకారం విస్తరించడంపై చర్చించారు. రెండు దేశాల ప్రతినిధులు అధికార స్థాయి చర్చలు కూడా నిర్వహించారు. తర్వాత ఇద్దరు నాయకులు 1,020 మెగావాట్ల "పునత్సాంగ్‌చు-2 హైడ్రోఎలక్ట్రిక్ ప్రాజెక్ట్"ను సంయుక్తంగా ప్రారంభించారు. ఈ విద్యుత్ ప్రాజెక్టును భారత్-భూటాన్ కలిసి నిర్మించాయి. ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను ఇరు దేశాలు పంచుకుంటాయని తెలిపారు

## జూబ్లీహిల్స్‌లో నాన్ లోకల్ నాయకులపై ఎన్నికల సంఘం ఆగ్రహం

హైదరాబాద్ నవంబర్ 11 : జూబ్లీహిల్స్‌లో నాన్ లోకల్ నాయకులపై ఎన్నికల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, రామచంద్ర నాయక్, ఎమ్మెల్సీ శంకర్ పోలింగ్ బూత్‌కు రావడంపై సీరియస్ అయింది. ఓటర్లను ప్రభావితం చేసేలా తిరుగుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. స్థానికేతరులైన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు నియోజకవర్గంలో యథేచ్ఛగా తిరుగుతున్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తూ అక్రమాలకు తెరతీశారు. రహమత్‌నగర్ డివిజన్ ఎస్‌డీపీ హోటల్ వద్ద కాంగ్రెస్ ఎమ్మెల్సీ శంకర్ తన అనుచరులతో హల్‌చల్ చేశారు. మరో పోలింగ్ బూత్ వద్ద కాంగ్రెస్ ఎమ్మెల్యే రామచందర్ నాయక్ పెత్తనం చలాయించారు. వెంగళరావునగర్ పోలింగ్ బూత్ వద్ద సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి భర్త మట్టా దయానంద్ ఉన్నారు. ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య.. రహమత్ నగర్ పోలింగ్ కేంద్రం వద్ద కూర్చొని ఓటర్లతో మాట్లాడారు. దీంతో ఓటర్లను ప్రభావితం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ నేతలు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు.

## నటుడు ధర్మేంద్ర మృతి వార్తలపై హేమా మాలిని తీవ్ర ఆగ్రహం!



న్యూ డిల్లీ నవంబర్ 11 : బీప్రముఖ బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర మృతి చెందారంటూ మం గళవారం ఉదయం మీడియాలో వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వార్తలను ఖండించింది ధర్మేంద్ర భార్య నటి హేమ మాలిని. ధర్మేంద్ర చికిత్సకు స్పందిస్తూ కోలు కుంటున్న సమయంలో ఆయన మరణించారంటూ వచ్చిన పుకార్లపై ఆమె తన ఆవేదనను వ్యక్తం చేసింది. ధర్మేంద్ర మృతి చెందారంటూ వస్తున్న వార్తలపై హేమా మాలిని స్పందిస్తూ.. ప్రస్తుతం జరుగుతున్నది క్షమించరానిది! చికిత్సకు స్పందించి, కోలుకుంటున్న వ్యక్తి గురించి బాధ్యత కలిగిన ఛానెల్‌లు తప్పుడు వార్తలను ఎలా ప్రచారం చేయగలవు? ఇది అత్యంత అగౌరవంగా, బాధ్యతారాహిత్యంగా ఉంది. దయచేసి మా కుటుంబానికి ప్రైవసీతో పాటు అవసరానికి తగిన గౌరవం ఇవ్వండి అని హేమమాలిని రాసుకోచ్చింది. ప్రస్తుతం ధర్మేంద్ర ముంబైలోని బ్రీచ్ క్యాండీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతుండగా.. ధర్మేంద్ర ఆరోగ్యంపై ఇప్పటికే అతడి కూతురు నటి ఈషా డియోల్ సోషల్ మీడియా వేదికగా క్లారిటీనిచ్చింది.



## బాంబు పేలుడు నేపథ్యంలో 3 రోజుల పాటు ఎర్రకోట బంద్

న్యూఢిల్లీ నవంబర్ 11 : దేశ రాజధాని ఢిల్లీలో ఉన్న ఎర్రకోట సమీపంలో సోమవారం రాత్రి ఏడు గంటలకు కారు పేలుడు ఘటన జరిగిన విషయం తెలిసిందే. ఆ పేలుడు ధాటికి 13 మంది మృతిచెందగా, 20 మంది వరకు గాయపడ్డారు. అయితే ఈ నేపథ్యంలో ఎర్రకోటను బంద్ చేశారు. రాబోయే మూడు రోజుల పాటు విజిటర్స్‌కు ఎర్రకోట బంద్ ఉంటుందని అధికారులు చెప్పారు. ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా దీనిపై ప్రకటన చేసింది. కారు బాంబు పేలుడు జరిగిన ప్రదేశంలో ప్రస్తుతం ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్ జరుగుతున్నది. అయితే ప్రజలు భారీ స్థాయిలో గుమ్మికూడే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎర్రకోటను బంద్ చేస్తున్నట్లు ఏఎస్ఐ ప్రకటించింది. కారు పేలుడుకు, ఫరీదాబాద్ టెర్రర్ మాడ్యూల్‌కు లింకు ఉన్నట్లు ప్రాథమిక విచారణ ద్వారా వెల్లడవుతున్నది. పేలడు కోసం డిటోనేటర్లు వాడినట్లు అనుమానిస్తున్నారు. అమోనియం నైట్రేట్ రసాయనం వాడి ఉంటారని భావిస్తున్నారు. సూసైడ్ బాంబర్ డాక్టర్ ఉమర్ మహమ్మద్ పేలుడుకు ముందు తన కారును ఎర్రకోట పార్కింగ్ ఏరియాలో సుమారు మూడు గంటల పాటు పార్కింగ్ చేశాడు. పేలుడు విచారణ చేపడుతున్న పోలీసులు.. పుల్వామాలో ఉన్న డాక్టర్ ఉమర్ ఫ్యామిలీని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనతో లింకున్న నలుగుర్ని ఇప్పటి వరకు అరెస్టు చేశారు. రెడ్‌ఫోర్ట్ మెట్రో స్టేషన్‌ను ఇవాళ మూసివేశారు.





## బ్రహ్మర్షి శ్రీనివాస శర్మ - పద్మావతి నూతన గృహప్రవేశం..

### ::: హాజరైన బంధుమిత్రులు

వనస్థలిపురం వార్త మిర్రర్ ప్రతినిధి : వనస్థలిపురం అభ్యుదోయ నగర్ టి ఎన్ ఆర్ ఎలైట్ హోమ్స్ లో బ్రహ్మశ్రీ శ్రీనివాస శర్మ - పద్మావతి ల నూతన గృహప్రవేశ మరియు సత్యనారాయణ స్వామి వ్రతం బందు మిత్రుల ఆనందోత్సవాల నడుమ ఘనంగా నిర్వహించారు,ఈ కార్యక్రమంలో ఎస్.ఎస్ వారాహి ఇన్ఫ్రా ప్రాజెక్ట్ ఎండి రసాల రమేష్ సాగర్, వార్త మిర్రర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ గొల్లూరి గణేష్ సాగర్, శివకుమార్, వార్త మిర్రర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏలే భాస్కర్, అక్కన్నపల్లి వీరయ్య, పగడిమర్రి శ్రీనివాస శర్మ మిత్ర బృందం శ్రీనివాస్ గుప్తా, సురపల్లి వెంకటేష్, సూర గోవర్ధన్ గుప్త, దాచేపల్లి వెంకటేష్ గుప్తా, గుర్రం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

మృతి చెందారు. ఈ ఆపరేషన్ మావోయిస్టుల కార్యకలాపాలను అణచివేయడంలో కీలక ముందడుగు అని పోలీసు అధికారులు వెల్లడించారు. పక్కా నిఘా సమాచారంతో ఈ ఆపరేషన్ ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. బీజాపూర్, దంతెవాడ జిల్లాల డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ), స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) బృందాలు సంయుక్తంగా అడవుల్లోకి వెళ్లాయి. ఉదయం 10 గంటల సమయంలో భద్రతా బలగాలను గమనించిన మావోయిస్టులు కాల్పులు ప్రారంభించగా, బలగాలు దీటుగా ఎదురుకాల్పులు జరిపాయి. సాయంత్రం వరకు కాల్పులు అడపాదడపా కొనసాగాయి. ఈ ఘటనలో ఇప్పటివరకు ఆరుగురు మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని బీజాపూర్ ఎస్పీ జితేంద్ర యాదవ్ ధృవీకరించారు. ఘటనా స్థలం నుంచి ఇన్సాస్ రైఫిల్స్, స్టెన్ గన్స్, .303 రైఫిల్స్‌తో పాటు భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు. మావోయిస్టుల యూనిఫాంలు, కమ్యూనికేషన్ పరికరాలు, విప్లవ సాహిత్యం పుస్తకాలు కూడా లభించాయని తెలిపారు. ఈ ఆపరేషన్‌పై బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ స్పందించారు. "ప్రస్తుతం మావోయిస్టు సంస్థ నాయకత్వం, దిశానిర్దేశం లేకుండా నైతికంగా దెబ్బతింది. కేవలం అబూజ్‌మఢ్ అడవుల్లోని కొన్ని ప్రాంతాలకే వారి ఉనికి పరిమితమైంది. నిఘా ఆధారిత ఆపరేషన్ల విజయానికి ఇది నిదర్శనం" అని ఆయన వ్యాఖ్యానించారు. తప్పించుకున్న మావోయిస్టులు పొరుగు జిల్లాల్లోకి ప్రవేశించకుండా అదనపు బలగాలను మోహరించి, అడవులను జల్లెడ పడుతున్నామని ఆయన తెలిపారు.

## పాడె మోసిన రేవంత్

నిర్వహించారు. మంత్రులు శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అందెశ్రీ అంత్యక్రియల అనంతరం ముఖ్యమంత్రి మీడియాతో మాట్లాడారు. వ్యక్తిగతంగా, తెలంగాణ సమాజానికి లోటు: రేవంత్ రెడ్డి అందెశ్రీ మరణం వ్యక్తిగతంగా తనకు, తెలంగాణ సమాజానికి తీరని లోటు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గతంలో రాష్ట్రం గురించి అనేక విషయాలు ఆయనతో చర్చించినట్లు తెలిపారు. అందెశ్రీ రాసిన 'జయ జయహే తెలంగాణ'ను రాష్ట్రగీతంగా నిర్ణయించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అందెశ్రీ ప్రతి మాట ప్రజా జీవితం నుంచి పుట్టుకు వచ్చిందని అన్నారు. ప్రతి పాట తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని నింపిందని అన్నారు. 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని పాఠ్యపుస్తకాల్లో చేరుస్తామని అన్నారు. అందెశ్రీ కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని అన్నారు. తన జీవితాన్ని ప్రజల కోసం త్యాగం చేసిన మహనీయుడు ఆయన అని అన్నారు. ఆయన రచనలకు సంబంధించిన 'నిప్పులవాగు' పుస్తకాన్ని ప్రతి గ్రంథాలయంలో అందుబాటులో ఉంచుతామని అన్నారు.

## 'శిఖం' భూభాగంలో ఆలయ నిర్మాణానికి అనుమతిపై హైకోర్టు అసహనం

హైదరాబాద్: చెరువు శిఖం భూమిలో ఆలయ నిర్మాణానికి జిల్లా కలెక్టర్ అనుమతి ఇచ్చిన తీరు పై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏ చట్టప్రకారం ఆమోదం ఇచ్చారో, నిధులు విడుదల చేశారో ప్రభుత్వ న్యాయవాది సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. కేసులో కలెక్టర్‌ను నిందితుల జాబితాలో ఎందుకు చేర్చలేదని పోలీసులను ప్రశ్నించింది. ఇరుపక్షాలు పూర్తి వివరాలతో హాజరు కావాలని సూచిస్తూ విచారణను ఈ నెల 18వ తేదీకి వాయిదా వేసింది. భూపాలపల్లి పట్టణ పరిధిలోని పుల్లూరి రామయ్యపల్లి గ్రామ చెరువు శిఖంలో అక్రమంగా ఆలయ నిర్మాణం జరుగుతోందని నాగవెల్లి రాజలింగమూర్తి 2024 జనవరిలో స్థానిక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. శిఖం భూమిలో 2 ఎకరాలను కబ్జా చేసి, వెంకటేశ్వరస్వామి దేవాలయం తో పాటు వాణిజ్య సముదాయ భవనం నిర్మాణం జరుగుతోందని ఆయన ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన స్థానిక కోర్టు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, గండ్ర జ్యోతి, గండ్ర గౌతమ్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని ఆదేశించింది. జనవరి 16న తమపై నమోదైన కేసును కొట్టివేయాలని, అలాగే ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని నిందితులు హైకోర్టులో పిటిషన్‌లు వేశారు. జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది.

## వైదేహి నగర్ నార్త్ కాలనీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడుగా రెండో సారి ఏకగ్రీవంగా ఎన్నికైన పోగుల రాంబాబు



ఎల్బీనగర్,12 నవంబర్ : వైదేహినగర్ నార్త్ కాలనీ ఓనర్స్ అసోసియేషన్ మూడో వార్షికోత్సవ వేడుకలను కాలనీ అసోసియేషన్ భవనంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సమావేశంలో విజయం వంతం గా పూర్తయిన అనేక అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించుకుని, భవిష్యత్తులో నిర్వహించ వలసిన ప్రజావసరాల గురించి విస్తృ త స్థాయి సమావేశంలో సమావేశంలోసభ్యులతో చర్చించి కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు. వాటిని స్థానిక ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సంబంధిత అధికారులతో సుధీర్ రెడ్డి చర్చించి, సమీక్షించి నిధులు మంజూరు చేయించుకుని, ఆ పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్టు అధ్యక్షుడు పోగుల రాంబాబు తెలిపారు. అసోసియేషన్ కోశాధికారి సమర్పించిన మూడు ఏళ్ల ఏళ్ల జమాకర్చుల వివరాలను సర్వసభ్య సమావేశంలో సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించినట్లు అధ్యక్ష కార్యదర్శులు పోగుల రాంబాబు, రాజేందర్రెడ్డి లు చెప్పారు,ఈ సర్వసభ్య సమావేశంలో అధ్యక్షులు పోగుల రాంబాబు మాట్లాడుతూ నిత్యం కాలనీ శుభ్రతకు సహకరిస్తున్న జిహెచ్ఎంసి శానిటేషన్ సిబ్బంది, విద్యుత్ శాఖ, వాటర్ వర్క్స్ సిబ్బంది వాటర్ వర్క్స్ఇతర అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.5.118 జీవో కన్వేయన్స్ డీడ్స్ అమలును పునరుద్ధించే విషయాన్ని గురించి తెలంగాణ ప్రభుత్వ అధికారులను, నాయకులను అసోసియేషన్ తరపున అనేక సార్లు కలిసి వారికి వినతిపత్రం ఇచ్చామని గుర్తు చేశారు. అప్పటి వరకు ప్రస్తుతం ఉన్న కార్యవర్గం 30.11.2025 వరకు కొనసాగుతారని తెలిపారు. తమను రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్న కాలనీ అసోసియేషన్ సభ్యులకు, మహిళా మణులకు, ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలను నిర్వహించిన ఎన్నికల అధికారులకు, కాలనీ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తున్న మన నియోజకవర్గ శాసనసభ్యులుదేవి సుధీర్ రెడ్డి కి, జిహెచ్ఎంసి అధికారులకు, వైదేహి నగర్ నార్త్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున ఎకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులు పోగుల రాంబాబు, రాజేందర్ రెడ్డిలు ధన్యవాదాలు తెలిపారు.



## గాంధీ విగ్రహ పునఃప్రతిష్ట స్థలం పరిశీలన

కల్వకుర్తి నవంబర్ 11 వార్త మిర్రర్ ప్రతినిధి:- కల్వకుర్తి పట్టణంలోని పాత గ్రామ పంచాయతీ ప్రాంగణంలో మహాత్మా గాంధీ విగ్రహం గతంలో గుర్తు తెలియని వ్యక్తుల చేత ధ్వంసం చేయబడిన విషయం తెలిసిందే. ఆ విగ్రహాన్ని పునఃప్రతిష్టించాలనే నిర్ణయం తీసుకుని మంగళవారం ఆ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర సమర యోధుడు మహాత్మా గాంధీ స్మారకార్థంగా త్వరలోనే కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, ఆర్య వైశ్య సంగం జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, ప్రముఖ పారిశ్రామికవేత్తలు జూలూరి రమేష్ బాబు, వాస శేఖర్, శ్రీధర్, జగదీశ్వర్, గంధం ప్రసాద్, మిర్యాల రాజయ్య, సంబు ముత్యాలు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమాకాంత్ రెడ్డి, ఎజస్, మసుద్, శ్రీకాంత్, సంతు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి నవంబర్ 11 కార్తిక మాసం సందర్భంగా జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం పోరుమల్ల ఎంపీపీ ఎస్ 94 మంది విద్యార్థులు కార్తిక వనభోజనం కొరకు రాయికల్ మండలం అల్లీపూర్ లో కొలువైన వెంకటేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించిన తర్వాత ఆలయ పూజారి సుధీర్ విద్యార్థిని విద్యార్థులను, ప్రధాన ఉపాధ్యాయులు సురేందర్, శ్రీధర్ రాజు, అనూష, జ్యోతి, విజయలక్ష్మి, శ్రీజలను ఆశీర్వదించడం జరిగింది. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రకృతి వనంలో వనభోజన కార్యక్రమం పాల్గొన్నారు.

## శాస్త్రీయ, సాంకేతిక విద్యా రంగాల అభివృద్ధికి ఆజాద్ చేసిన కృషి ఎనలేనిది

### ::: స్ఫూర్తి విద్యా సంస్థల చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్



రామంతపూర్ వార్త మిర్రర్ ప్రతినిధి : భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా పనిచేసి విద్యారంగానికి బలమైన పునాదులు వేసిన ఘనత మౌలానా అబుల్ కలాం ఆజాద్కే దక్కుతుందని స్ఫూర్తి విద్యాసంస్థల చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్ అన్నారు. మంగళవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని రామంతపూర్ స్ఫూర్తి మహిళా డిగ్రీ కళాశాలలో వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా విద్యారంగ ప్రగతికి ఆయన చేసిన సేవలను స్మరించుకోవాలని అన్నారు. ఆ మహనీయుడి జయంతినే జాతీయ విద్యా దినోత్సవంగా నవంబర్ 11 దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.విద్యారంగంలో అబుల్ కలాం ఆజాద్ అమలు చేసిన వినూత్న సంస్కరణలు దేశంలో విద్యా అభివృద్ధికి దోహదపడ్డాయని గుర్తుచేశారు. శాస్త్రీయ, సాంకేతిక విద్యారంగాల అభివృద్ధికి ఆయన చేసిన కృషి ఎనలేనిదని రాపర్తి సురేష్ గౌడ్ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో రామంతపూర్ స్ఫూర్తి డిగ్రీ మహిళా కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు

## మార్చాల గ్రామంలో మహిత హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

- వైద్యం అంటే కేవలం వృత్తే కాదు అది ఒక సేవా ధర్మం
- ప్రభుత్వ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం






కల్వకుర్తి నవంబర్ 11 వార్త మిర్రర్ ప్రతినిధి:- కల్వకుర్తి మండలం మార్చాల గ్రామంలో మహిత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరనికి ప్రభుత్వ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.మహిత హాస్పిటల్ వైద్య బృందం అనుభవజ్ఞులైన వైద్యుల చేత దాదాపు 400 మందికి పైగా గ్రామస్థులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శివరాం మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించడం చాలా అవసరం అని పేర్కొన్నారు. మహిత హాస్పిటల్ వంటి సంస్థలు ముందుకు వచ్చి ఉచిత శిబిరాలను నిర్వహించడం సమాజానికి ఆదర్శమని ఆయన అభిప్రాయపడ్డారు. వైద్య సేవలను అందించడం కేవలం వృత్తి కాదని, అది ఒక సేవా ధర్మమని అన్నారు. ఈ శిబిరం ద్వారా గ్రామ ప్రజలకు ఉపయోగకరమైన వైద్య సలహాలు, మందులు అందించబడుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బాలయ్య, మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షులు తలసాని కృష్ణారెడ్డి,మాజీ ఎంపీటీసీ సభ్యులు కడల మల్లేష్ సంతోష్, మాజీ ఉపసర్పంచ్ మదన్మోహన్ రావు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీధర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి,కల్వకుర్తి మండల పార్టీ యూత్ అధ్యక్షులు వట్టేపు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డ్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్





కల్వకుర్తి నవంబర్ 11 వార్త మిర్రర్ ప్రతినిధి:- కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడి, వారికి అందిస్తున్న సౌకర్యాల పై వివరాలు తెలుసుకున్నారు. మొక్కజొన్న సేకరణ కేంద్రంలో రైతుల నుంచి సేకరించిన మొక్కజొన్న నిల్వల నాణ్యతను స్వయంగా పరిశీలించి, కొనుగోలు ప్రక్రియ సక్రమంగా జరుగుతున్నదా అనే అంశాన్ని పరిశీలించారు. తేమశాతం యంత్రం సహాయంతో పరీక్షించి, పంట నాణ్యతను అంచనా వేశారు. కొనుగోలు కేంద్రాల్లో తేమశాతం ప్రమాణాలు సరిగ్గా పాటించబడుతున్నాయా లేదా అనే విషయాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ... రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు కేంద్రాలను సమీప ప్రాంతాల్లో మరింత అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే ప్రతి కొనుగోలు కేంద్రంలో సరిపడా అన్ని వసతులను అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. రైతులు మార్కెట్ యార్డుకు తెచ్చిన పంటను నిల్వ చేయడంలో లేదా తరలించడంలో సమస్యలు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. రవాణా సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేయాలని, రవాణా వ్యవస్థ సజావుగా సాగేందుకు ట్రాక్టర్ల మరియు లారీలు అందుబాటును సమీక్షించాలని అధికారులు సూచించారు. పంట తేమ శాతం, నాణ్యత ప్రమాణాలపై సిబ్బంది స్పష్టమైన అవగాహనతో పని చేయాలని, రైతులకు తగిన ధర లభించేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. రైతులు కేంద్రాలకు తెచ్చిన వెంటనే తూకం వేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అనవసర కాలయాపనతో రైతులను ఇబ్బంది పెట్టకుండా చూడాలన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన మొక్కజొన్న ఆన్లైన్ వివరాల నమోదు ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియలో పారదర్శకతను కాపాడుతూ, రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూసుకోవాలని కలెక్టర్ ప్రత్యేకంగా సూచించారు. రైతులు ఎదుర్కొంటున్న చిన్నచిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట మార్క్ ఫెడ్ అధికారులు తహసీల్దార్ ఇబ్రహీం ఉన్నారు.

## రైతులకు ఇబ్బందులు రాకుండా సాఫీగా ధాన్యం కొనుగోలు

- మద్దతు ధరకు అదనంగా లభిస్తున్న ధాన్యం ధర
- అన్ని రకాల ధాన్యాన్ని కొనుగోలు చేయాలి
- 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లర్లు కొనుగోలు
- సూర్య రైస్ ఇండస్ట్రీస్ ను తనిఖీ చేసిన సబ్ కలెక్టర్ అమిత్





మిర్యాలగూడ ,నవంబర్ :-11 (వార్త మిర్రర్) సీజన్లో రైతులకు ఇబ్బందులు రాకుండా మిల్లర్లు సాఫీగా ధాన్యం కొనుగోలు చేయాలని, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ మాలెంపాటి ఆదేశించారు. మంగళవారం మిర్యాలగూడ మండలం యాద్గార్ పల్లి గ్రామ శివారులోని సూర్య రైస్ ఇండస్ట్రీస్ ను నల్లగొండ జిల్లా అదనపు కలెక్టర్, సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైస్ మిల్లులో ధాన్యం ట్రాక్టర్ల వద్ద ధాన్యాన్ని స్వయంగా పరిశీలించిన తదుపరి రైతులతో ధాన్యం ధర విషయంలో రైతులతో మాట్లాడారు. అనంతరం మిల్లులో జరిగిన విలేకరుల సమావేశంలో సబ్ కలెక్టర్ అమిత్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశానుసారం ప్రతిరోజు రైస్ మిల్లులను తనిఖీ చేయడంతో పాటు లభిస్తున్న ధరలను పరిశీలిస్తున్నట్లు, సమీక్షిస్తున్నట్టు ఆయన తెలిపారు. రైస్ మిల్లర్లు అన్ని రకాల ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. రైతులు ధాన్యాన్ని రైస్ మిల్లులకు తెచ్చిన సమయంలో ఆలస్యం చేయకుండా దిగుమతి చేసుకోవాలన్నారు. ప్రస్తుతం ధాన్యానికి మద్దతు ధర కన్నా ఎక్కువ ధర చెల్లిస్తున్నారని రైతులు కూడ ఫిర్యాదు చేయడం లేదని సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదేవిధంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తయ్యేంతవరకు రైతులకు న్యాయం చేసేందుకు మద్దతు ధర కంటే అదనపు ధర మిల్లర్లు చెల్లించాలన్నారు. ఇప్పటివరకు రైస్ మిల్లర్లు మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారన్నారు. ధాన్యం ట్రాక్టర్లతో మిల్లులకు వచ్చే రైతులతో గౌరవంగా బాధ్యతగా మిల్లర్లు వ్యవహరించాలని మిల్లుల వద్ద రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. మిల్లుల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడవలసిన బాధ్యత మిల్లర్లపై ఉందన్నారు. ప్రతి మిల్లర్లు ధాన్యం కొనుగోలు ఉదయం 6 గంటల నుంచి ప్రారంభిస్తున్నారని అదే ప్రక్రియ కొనసాగించాలన్నారు. ఆంధ్ర ధాన్యం రాకుండా ఎపి సరిహద్దుల్లో వాడపల్లి, నాగార్జునసాగర్ వద్ద చెక్ పోస్టులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనైనా ఆంధ్రప్రదేశ్ ధాన్యం మిర్యాలగూడ ప్రాంతానికి రాకుండా చూస్తామన్నారు.ప్రతిరోజు 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మద్దతుకు అదనపు ధర చెల్లించిరైతులకు ఇబ్బంది లేకుండా ప్రతిరోజు రైస్ మిల్లుల వద్ద ఉదయం 6 గంటల నుండి ధాన్యం కొనుగోలు చేస్తున్నామని మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గౌరు శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు అదనంగా ధర ధాన్యానికి చెల్లించి మిల్లుల వద్ద కొనుగోలు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఇప్పటివరకు మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, మరో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. ప్రతిరోజు 20 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లుల వద్ద కొంటున్నామని, రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని ఇబ్బందులు లేకుండా వెంటనే దిగుమతి చేసుకుంటున్నామన్నారు. నిరంతరం రైతులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు.

## మొంధా తుఫాను వల్ల నష్టపోయిన పంటలను పరిశీలించేలా వ్యవసాయ అధికారులను ఆదేశించాలి

### అదనపు కలెక్టర్ అమిత్ కు రైతు సంఘం వినతి



మిర్యాలగూడ , నవంబర్ 11:- (వార్త మిర్రర్) తుఫాను వల్ల నష్టపోయిన పొలాల పరిశీలనకు వ్యవసాయ శాఖ ఆధికారులను ఆదేశించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్, సబ్ కలెక్టర్ ఎం. నారాయణ్ అమిత్ కు మంగళవారం మిర్యాలగూడ మండలం యాద్గారుపల్లి గ్రామ శివారులోని సూర్య రైస్ మిల్లులో మెమోరండం సమర్పించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిల్లా కనకయ్య మాట్లాడుతూ ముంథా తుఫాను వలన వందల ఎకరాలు నేలమట్టమై రైతులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని నేటి వరకు వ్యవసాయ శాఖకు సంబంధించిన అధికారులు మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని ఏ గ్రామానికి పోలేదని పరిశీలన చేయలేదని వారన్నారు రైతులు చాలా ఇబ్బందులు పడుతూ పండినటువంటి వరి చేనుకు కోత మిషన్లు దొరక్క చాలా ఇబ్బందులు పడుతున్నారని ఇప్పటివరకు కోసిన పొలాల్లో ఒక ఎకరానికి 25 బస్తాల నుండి 30 బస్తాల వరకే దిగుబడి వచ్చిందని దాని వలన రైతులు పెట్టిన పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదని వారన్నారు. ఒకవైపు కోత మిషన్లు దొరకక రైతులు చాలా ఇబ్బందులు పడుతుంటే, తుఫాను వలన పసుపు ముద్దలు తయారు కావడం వలన వడ్లకు పసుపు కాటుక రావడం జరిగిందన్నారు ఇదే మిల్లర్లు కొర్రీలు పెట్టి రైతుల దగ్గర నుండి ధాన్యాన్ని తక్కువ రేటుకు చెప్పి రైతుల దగ్గర నుంచి కొనుగోలు చేస్తున్నారన్నారు అసలే తుఫాను వలన నష్టపోయిన రైతులను మిల్లర్ల పండించిన ధాన్యానికి అభ్యంతరాలు పెట్టకుండా బే షరతుగా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ధరలు తగ్గించవద్దన్నారు. ఇప్పటికైనా సబ్ కలెక్టర్ ఆదేశించి వ్యవసాయ అధికారులను గ్రామాలకు పంపి వరి పడిపోయినదో అధికారులు పరిశీలన చేసి రైతులకు నష్టపరిహారం అదే విధంగా చూడాలన్నారు కార్యక్రమంలో పచ్చిపాల లింగయ్య, ఎం ఆశీర్వాదం, డి.ఉపేందర్, బి బాలకృష్ణ జి.సతీష్, జి వెంకటయ్య, మట్టయ్య, రవీందర్, నాగునాయక్, వెంకన్న, శివలింగం, రాములు, యాదగిరి, విశ్వనాథ్, రైతులు మెమోరాండాలి సమర్పించారు.



## ఉమ్మడి జిల్లా పాఠశాలల అథ్లెటిక్స్ పోటీలకు అల్లీపూర్ విద్యార్థినులు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి నవంబర్ 11

ఇటీవల జగిత్యాల జిల్లాలోని ఎస్. కె. ఎన్. ఆర్. డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో రాయికల్ మండలం అల్లీపూర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన శశిప్రియ హై జంప్ లో గోల్డ్ మెడల్, టి. అనూష జావెలిన్ నందు సిల్వర్ మెడల్,పి. శిరీష డిస్కస్ త్రో లో బ్రాంజ్ మెడల్ సాధించి ఈ నెల 12వ తేదీన కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్లో జరిగే ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు పి.కిరణ్, పిడి క్రిష్ణ ప్రసాద్ తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను ఉపాద్యాయులు, గ్రామస్తులు అభినందించారు.



## కిడ్నీ బాధితుడికి ఆర్థిక సహాయం అందించిన- మాజీ సర్పంచ్ వీరమల్ల శ్రీశైలం గౌడ్

నల్లగొండ వార్త మిర్రర్ ప్రతినిధి

గట్టుప్పల్ మండలం ధర్మ తండాకు చెందిన కరెంటోతూ లింగయ్య కు రెండు కిడ్నీలు చెడిపోయి అనారోగ్యంతో బాధపడుతూ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న తేరేటిపల్లి మాజీ సర్పంచ్ వీరమల్ల శ్రీశైలం గౌడ్ హాస్పిటల్ కి వెళ్లి పరామర్శించి, ఆ కుటుంబానికి ధైర్యం చెప్పి తన వంతుగా తక్షణ సహాయం కింద 50 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు మెరుగైన వైద్యం చేయించుకొని ఆరోగ్యవంతంగా ఉండాలని శ్రీశైలం గౌడ్ తెలిపారు,ఆపదలో ఉన్న మాకు ఆర్థిక సాయం అందించిన వీరమల్ల శ్రీశైలం గౌడ్ కు ధన్యవాదాలు తెలిపారు




## బ్రహ్మర్షి శ్రీనివాస శర్మ - పద్మావతి నూతన గృహప్రవేశంలో పాల్గొన్న ఎస్.ఎస్ వారాహి ఇన్ఫ్రా ప్రాజెక్ట్ అధినేత రసాల రమేష్ సాగర్

వనస్థలిపురం వార్త మిర్రర్ ప్రతినిధి

వనస్థలిపురం అభ్యుదోయ నగర్ టి ఎన్ ఆర్ ఎలైట్ హెూమ్స్ లో బ్రహ్మశ్రీ శ్రీనివాస శర్మ - పద్మావతి ల నూతన గృహప్రవేశ మరియు సత్యనారాయణ స్వామి వ్రతం బందు మిత్రుల ఆనందోత్సవాల నడుమ ఘనంగా నిర్వహించారు,ఈ కార్యక్రమంలో ఎస్.ఎస్ వారాహి ఇన్ఫ్రా ప్రాజెక్ట్ ఎండి రసాల రమేష్ సాగర్, వార్త మిర్రర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ గొల్లూరి గణేష్ సాగర్, శివకుమార్, వార్త మిర్రర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏలే భాస్కర్, అక్కన్నపల్లి వీరయ్య, పగడిమర్రి శ్రీనివాస శర్మ మిత్ర బృందం శ్రీనివాస్ గుప్తా, సురపల్లి వెంకటేష్, సూర గోవర్ధన్ గుప్త, దాచేపల్లి వెంకటేష్ గుప్తా, గుర్రం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు



## మహేశ్వరం మార్కెట్ కమిటీల వేలం:కృష్ణనాయక్,సిహెచ్.యాదయ్య.

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 11 : మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో వాణిజ్య సముదాయంలోని ఐదు కమర్షియల్ షాపుల వేలంపాట ఈరోజు నిర్వహించబడింది.ఈ సందర్భంగా ఎఎంసీ మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణ నాయక్, వైస్ చైర్మన్ సిహెచ్.యాదయ్య పర్యవేక్షణలో ఐదు షాపులు ప్రాకతీయంగా ఎన్నుకోబడ్డాయి.ఎంపికైన వారు %-%షాప్ నం.1 %-% నరసింహా గౌడ్ ( ఓసి),షాప్నం.2 %-% లాజర్ ( ఎస్సీ),షాప్ నం.3 %-% మల్లేష్ (ఓసి),షాప్ నం.4 %-% గోపాల్ నాయక్ (ఎస్సీ),షాప్ నం.5 %-% శ్రీకాంత్ ( బీసీ).ఈ కార్యక్రమంలో చైర్మన్,వైస్ చైర్మన్లను శాలువా కప్పి సన్మానం చేశారు.ఈ సందర్భంగా చైర్మన్ కృష్ణ నాయక్ మాట్లాడుతూ వేలంపాట ద్వారా నెలవారీగా రూ.53,650 ఆదాయం రావడం ఎంతో ఆనందంగా ఉంది.ఈ ఆదాయం వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి తోడ్పడుతుంది అని తెలిపారు.కార్యక్రమంలో డీ.డి.ఎం.ప్రసాద్ రావు (హైదరాబాద్),ఇబ్రహీంపట్నం సెక్రటరీ సంతోష్ కుమార్,మహేశ్వరం మార్కెట్ కమిటీ సెక్రటరీ సుజాత, సభ్యులు పాల్గొన్నారు.

# గడిచిన ఏడాది కాలంలో ప్రభుత్వ సహకారంతో ఓయూలో పలు అభివృద్ధి కార్యక్రమాలు వైస్ ఛాన్సలర్ కుమార్ మొలుగరం

సికింద్రాబాద్, వార్త మిర్రర్ నవంబర్ 11....ఉస్మానియా విశ్వవిద్యాలయానికి సమగ్ర ప్రగతి ప్రణాళికను రూపొందించే ఉద్దేశంతో ప్రిన్సిపల్స్, డీన్స్, డైరెక్టర్స్, విభాగాధిపతులతో ఉపకులపతిగా ఆచార్య ప్రొఫెసర్ కుమార్ మొలుగరం భేటీ అయ్యారు. పరిపాలనా భవన్ లోని సెనెట్ హాల్లో అకడమిక్ అడ్మినిస్ట్రేటర్లను ఉద్దేశించి ప్రసంగించారు. గడిచిన ఏడాది కాలంలో విశ్వవిద్యాలయంలో అభివృద్ధి కార్యక్రమాలు, అకడమిక్ ఎక్సలెన్స్, పరిశోధనాభివృద్ధి, మౌళిక వసతుల కల్పన, నూతన ఆవిష్కరణలు ప్రాధాన్య అంశాలుగా విజయవంతంగా పనిచేశామని స్పష్టం చేశారు. విశ్వవిద్యాలయంలోని ఆచార్యులు, విద్యార్థులు, సిబ్బంది సహకారంతో గుణాత్మకమైన మార్పును నమోదు చేశామన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రోత్సాహంతో యూనివర్శిటీ అభివృద్ధికి బాటలు పడ్డాయన్నారు. ఇప్పటికే విశ్వవిద్యాలయ ప్రగతి కోసం వెయ్యి కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన విషయం తెలిసిందేనని... దానికి సంబందించిన సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. వచ్చే ఏడాదిలో ఎన్.ఐఆర్ఎఫ్, న్యాక్, క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్ తదితర ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సంస్థల లో మెరుగైన ర్యాంకు సాధించటానికి ప్రతి ఒక్కరూ తమ శక్తి వంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. వ్యక్తులుగా మనమంతా ఏమీ కాదన్న ప్రొఫెసర్ కుమార్... ఉస్మానియా అధ్యాపకులుగా కలిసికట్టుగా ఓ శక్తిగా ఉన్నామని గుర్తు చేశారు. వ్యక్తుల గొప్పతనం గురించి కాకుండా.... ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రతిష్టను పెంచే దిశగా పనిచేద్దామని కోరారు. ఓయూలోని వివిధ విభాగాలు, రంగాల్లో సాధించిన ప్రగతిపై సమాచారంతో కూడిన ప్రత్యేక బ్రోచర్ ను రిజిస్ట్రార్ ఆచార్య జి. నరేష్ రెడ్డి, ఓఎస్డీ ఆచార్య జితెందర్ కుమార్ నాయక్, యూజీసీ వ్యవహారాల డీన్ ఆచార్య లావణ్య, జాయింట్ రిజిస్ట్రార్ శ్రీమతి నీరజ, ఎఫ్ఓ శ్రీనివాస్ తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వివిధ కళాశాలల ప్రిన్సిపల్స్, డీన్స్, డైరెక్టర్స్ నుంచి పరిపాలనకు అవసరమైన సూచనలు, సలహాలు స్వీకరించారు. సుమారు రెండు గంటల పాటు జరిగిన ఈ



కార్యక్రమంలో విశ్వవిద్యాలయంలో బాధ్యతాయుతమైన పరిపాలనా పదవుల్లో ఉన్న ఆచార్యులందరూ పాల్గొన్నారు. ఉపకులపతిగా ఏడాది పూర్తి చేసుకున్న ప్రొఫెసర్ కుమార్ మొలుగరం కు పలువురు బోధన, బోధనేతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. నరేష్ రెడ్డి మాట్లాడుతూ... విశ్వవిద్యాలయ ప్రగతికి విలువైన కాలాన్ని పెట్టుబడిగా పెట్టి శక్తివంచన లేకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఉపకులపతిగా ప్రొపెసర్ కుమార్ ఓయూ ప్రగతిలో తనదైన ముద్రవేశారన్నారు. ఓఎస్డీ ప్రొఫెసర్ జితెంద్ర కుమార్ నాయక్ మాట్లాడుతూ అతి తక్కువ కాలంలోనే నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా విజయవంతమైన ఫలితాలను సాధించామని అన్నారు. ప్రొఫెసర్ కుమార్ నాయకత్వంలో ఓయూను ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దుకుందామని పిలుపునిచ్చారు.పలువురు ప్రిన్సిపల్స్, డీన్స్, డైరెక్టర్లు, పాలనాధికారులు ఈ సందర్భంగా తమ అభిప్రాయాలు పంచుకున్నారు.

# దేవరకొండ ఏబీవీపీ నూతన నగర కమిటీ ఎన్నిక

దేవరకొండ నవంబర్ 11 వార్త మిర్రర్ :దేవరకొండలో మంగళవారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నూతన నగర కమిటీ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా నూతన నగర కార్యదర్శిగా పగిళ్ల విక్రమ్ ఎన్నికయ్యారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నల్గొండ జిల్లా కన్వీనర్ జినుకుంట్ల జయంధర్ పాల్గొని మాట్లాడుతూ "జాతీయ పునర్నిర్మాణం అనేది కేవలం ప్రభుత్వ విధానాలతో సాధ్యం కాదు. ప్రతి యువకుడు తన జీవితంలో ఆచరణ ద్వారా దేశం కోసం కృషి చేసినప్పుడే అది సాధ్యమవుతుంది. అదే ఏబీవీపీ సంకల్పం" అని అన్నారు. నూతనంగా కమిటీలో ఎన్నికైన వారు నూతన దేవరకొండ నగర కార్యదర్శిగా పగిళ్ల విక్రమ్ జాయింట్ సెక్రెటరీగా యలమల హేమ సుందర్, జి శివరామ రాజు, కె సునీత రాథోడ్, యు ప్రవళిక వైస్ ప్రెసిడెంట్ గా ఆర్ సంధ్య, అలేఖ్య, ఆర్ అరవింద్, జి అరవింద్నగర్ గర్ల్స్ కన్వీనర్ తోట అంకిత, గర్ల్స్ కో కన్వీనర్ వస్కుల కావ్య, ఆర్ మౌనికనగర సోషల్ మీడియా కన్వీనర్ ఎస్ బన్నీ స్టూడెంట్ ఫస్ట్ డెవలప్మెంట్ కన్వీనర్ ఏ శివ, సిద్దు స్టూడెంట్ ఫర్ సేవ కన్వీనర్ ఎన్ వరుణ్, వినోద్ నగర కార్యవర్గ సభ్యులు పి రామ్, హనుమంత్, నరసింహ, కిరణ్ కుమార్, సంతోష్, మనీ, గాయత్రి, సౌజన్య, కీర్తన, సునీత, సంధ్య, మౌనిక



తదితరులను ఎన్నుకోవడం జరిగింది నూతన నగర కమిటీకి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్గొండ విభాగ్ హాస్టల్స్ కన్వీనర్ యలమల గోపిచంద్, ఐత రాజు కొండల్, భరత్, ఈశ్వర్ సహా పలువురు ఏబీవీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# గంజాయి వ్యసన పరుల ముఠా అరెస్ట్ 1.4 కేజీల ఎండుగంజాయి స్వాధీనం గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం

డి.ఎస్.పి కె, రాజశేఖర్ రాజు

మిర్యాలగూడ నవంబర్ 11:- మిర్యాలగూడ పట్టణంలో గంజాయి కొని సేవిస్తున్న,గంజాయితో ఉన్ననిందితులు అఫ్రోజ్, పిక్ హైమద్, సనావత్ అశోక్,మహమ్మద్ నసీరుద్దీన్ బాబా, వల్లవాయి నవీన్, మల్లెబోయిన రాకేష్,సాయిరామ్ ఒన్ టౌన్ పోలీసులు అరెస్టు చేసినట్టు మిర్యాలగూడ డిఎస్పీ కె. రాజశేఖర్ రాజు తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిందితుల నుండిఎండుగంజాయి 1.4 కేజీఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ప్రతిష్టాత్మకంగా తీసుకొన్న, మాదక ద్రవ్యాల నిర్మూలన, మిషన్ పరివర్తన్ లో భాగంగా నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు మాదక ద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణా పై ఉక్కుపాదం మోపి నిరంతర నిఘాలో బాగంగా మంగళవారం ఉదయం సుమారు 9 గంటల సమయంలో మిర్యాలగూడ, శివారులోని అగ్రిగోల్డ్ వెంచర్ లో గంజాయి తాగుటకు గంజాయి తెచ్చుకున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు ఎస్ఐ ఎ.సైదిరెడ్డికి నమ్మదగిన సమాచారం రాగా ఎస్ఐ సిబ్బందితో వెంచర్కు చేరుకునే సమయానికి, ఆరుగురు యువకులు గంజాయి వున్న కవర్ తో వుండగా పోలీసులు చాకచక్యంగా వారిని పట్టుకుని వారి వివరాలు తెలుసుకుని విచారించి వారి వద్ద నుంచి ఒక నలుపు పోలితిన్ కవర్లో ఉన్న మొత్తం 1.4 కేజీ బరువున్న గంజాయి ప్యాకెట్, ఒక సెల్ఫోన్ ను స్వాధీన పరచుకొన్నట్టు తెలిపారు.నేరం జరిగిన విధానం వివరిస్తూనిందితులైన షేక్ అఫ్రోజ్, ననావాత్ అశోక్, మహమ్మద్ నసీరుద్దీన్ బాబా, ఎస్కె హైమద్, వల్లవాయి నవీన్, మల్లెబోయిన రాకేష్ మారిలు స్నేహితులు సాయిరాం ద్వారా గంజాయి త్రాగడం అలవాటయ్యింది, వీరంతా కలిసి గంజాయి త్రాగేవాళ్ళు. ఎప్పటిలాగా




ఆరుగురు కలిసి 1200 రూపాయలు వేసుకొని 7200 రూపాయలతో సాయిరామ్ దగ్గర సుమారు 1.4 కేజీల గంజాయి ప్యాకెట్ ను అద్దంకి-నార్కట్పల్లి హై వే వద్ద వై జంక్షన్ వద్ద కొనుగోలుచేసి మంగళవారం ఉదయం సుమారు 9 గంటలకు యధావిధిగా అపుడప్పుడు గంజాయి పంచుకొని తాగెందుకు మిర్యాలగూడ పట్టణ శివార్లలోని అగ్రిగోల్డ్ వెంచర్ లోకి వెళ్లి అందులో పంచుకొనే క్రమములో పోలీస్ పట్టుబడ్డారని తెలిపారు. డిఎస్పీ రాజశేఖర్ రాజు పర్యవేక్షణలో కేసు ను చేదించడం లో ప్రతేక ప్రతిభ కనపరిచిన ఒన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఎం.నాగభూషణరావు, ఎస్ఐ ఎ.సైదిరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రాజారం, పోలీసు కానిస్టేబుల్స్ నల్లగంతుల శ్రీను, గద్దల హుస్సేన్, వీరబాబు, నర్సింహా, భీమనపల్లి ప్రసాద్, శివాజీ మరియు హెూం గార్డ్ సాయి, గిరి, అనిల్ లను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ ప్రత్యేకంగా అభినందించారు.

# అవంతిపురం వ్యవసాయ మార్కెట్ అవకతవకలపై విచారణ చేస్తున్న విజిలెన్స్

మిర్యాలగూడ నవంబర్ 11:- (వార్త మిర్రర్) మిర్యాలగూడ మండలం అవంతీపురం వ్యవసాయ మార్కెట్లో ఏర్పాటు చేసిన ఆలగడపల పీఏసీఎస్ ఐ కె పి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ట్రక్ షీట్ జారీ చేయడంపైన మంగళవారం విజిలెన్స్ డీఎస్పీ యాదగిరి ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయం లో 4 గంటల పాటు విచారణ చేపట్టారు. మిర్యాలగూడ మండలం అన్నారం గ్రామానికి చెందిన సారెడ్డి సైదిరెడ్డి, త్రిపురారం మండలం అప్పలమ్మగూడెం గ్రామానికి చెందిన ధనావత్ తులస్యానాయక్లను విచారించారు. ఎంత ధాన్యం, ఎక్కడి నుంచి తెచ్చారు. ఏ మిల్లులకు తరలించారో వివరాలు సేకరించారు. అదేవిధంగా పీఏసీఎస్ ఇన్చార్జి సీఈవో సైదులు, వ్యవసాయ విస్తరణాధికారి అఫ్రీన్లు ధాన్యం రాకుండా ట్రక్ షీట్ ఎలా మంజూరు చేశారని, ట్యాబ్లో ఎలా అప్లోడ్ చేశారని ప్రశ్నించి వివరాలు సేకరించారు. విచారణలో 741బస్తాలు(296.40 క్వింటాళ్లు) ధాన్యం మిర్యాలగూడ పట్టణ పరిధిలోని శ్రీశివసాయి రైస్ ఇండస్ట్రీస్కు తరలించినట్లు విచారణలో రైతులు పేర్కొన్నారు. పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు డీఎస్పీ యాదగిరి పేర్కొన్నారు. ఆయన వెంట వ్యవసాయాధికారులు, సివిల్ సప్లయ్ అధికారులు ఉన్నారు.



# థీమ్స్‌తో బ్లూ డే రెడ్ డే సెలబ్రేషన్స్ పాఠశాల చైర్మన్ చినప్పరెడ్డి

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి నవంబర్ 11 చౌటుప్పల్ మండలం కేంద్రంలోని అన్నా మెమోరియల్ హై స్కూల్ సి బి ఎస్ ఈ లో నవంబర్ 10,11 తేదీలలో "శాంతి ప్రశాంతత" %-% "ఆరోగ్యంగా తిని బలంగా ఉండండి" అనే థీమ్స్‌తో బ్లూ డే రెడ్ డే సెలబ్రేషన్స్ ఉత్సాహంగా నిర్వహించారు.విద్యార్థులు రంగుల ఆధారిత సాంస్కృతిక కార్యక్రమాలు, క్రాఫ్ట్స్, పోటీలు, గేమ్స్‌లో పాల్గొని తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. ఈ వేడుకలతో పాఠశాల ఆవరణం ఆనందోత్సాహంతో గడిపారు.ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ ఫా. చినప్పరెడ్డి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడంతో పాటు, ఆనందదాయకమైన విద్యా వాతావరణాన్ని కల్పిస్తాయని తెలిపారు.పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల కృషిని ఆయన ప్రశంసించారు. బ్లూ, రెడ్ డే వేడుకలు పాఠశాల సమగ్ర విద్యా విధానానికి ప్రతిబింబంగా నిలిచాయి..





# సీఎంఆర్ ఫ్ చెక్కులను పంపిణీ..

## ఎమ్మెల్సీ నెల్లి కంటి సత్యం

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి నవంబర్ 11

పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్సీ నెల్లి కంటి సత్యం అన్నారు.చౌటుప్పల్ లోని సిపిఐ మండల పార్టీ కార్యాలయంలో చౌటుప్పల్ మరియు నారాయణపురం మండలాలకు చెందిన (సీఎంఆర్ ఫ్) చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సత్యం మాట్లాడుతూ ఈ పథకం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ప్రవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పేదవారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా కొంత లబ్ధి చేకూరుతుందని అన్నారు. పేద ప్రజలు ఎవరైనా అత్యవసర పరిస్థితుల్లో ప్రవేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకుంటే ఆరు నెలల లోపు దరఖాస్తు చేసుకోవాలని ఈ ముఖ్యమంత్రి సహాయనిధి ఆపదలో ఉన్న పేదవాళ్లకు అండగా నిలుస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్ రెడ్డి, చౌటుప్పల్ మున్సిపల్ శాఖ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, సిపిఐ నాయకులు ఉడత రామలింగం,కొండూరు వెంకటేష్,రొండి నరసింహ,టంగుటూరి రాములు,రోషణగారి అంజయ్య,బత్తుల సుధాకర్, నీల బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు..




# తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలి..

## అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లు డ్రైనేజీలు

## సిపిఎం పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు. బూరుగు కృష్ణారెడ్డి

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి నవంబర్ 11చౌటుప్పల మున్సిపాలిటీ,చౌటుప్పల్ మండలం లోని సమస్యలను తొందరగా పరిష్కరించాలి తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలని త్రిబుల్ ఆర్ భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూర్గు కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం చౌటుప్పల సిపిఎం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చౌటుప్పల్ మండలంలో ని గ్రామాలలో వర్షాలకు తోటి రోడ్లు డ్రైనేజీలు అస్తవ్యస్తంగా తయారయ్యాని వాటిని త్వరగా నిర్మించాలని కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల మార్కెట్ లో ఉన్నటువంటి ధాన్యం తడవడం వల్ల ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ప్రభుత్వం రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ఉందని అన్నారు. త్రిబుల్ ఆర్ భూ నిర్వాసితుల నోటీసుల పేరుమీద ప్రభుత్వ అధికారులు బెదిరిస్తున్నారని భూ నిర్వాసితులకు మార్కెట్ ధరలు ఇచ్చి రైతులను కాపాడాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా, గంగాదేవి సైదులు, రాగిరి కిష్టయ్య, గోశిక కరుణాకర్, మండల కార్యదర్శి వర్గ సభ్యులు చీక సంజీవరెడ్డి, తడక మోహన్, బోయ యాదయ్య, చింతల సుదర్శన్, పల్లె మధు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు..



# ఘనంగా అందెశ్రీ కి ఘన నివాళులు

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి నవంబర్ 11

చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధి బస్టాండ్ ఆవరణలో తెలంగాణ కళాకారుడు కవి రచయిత అందెశ్రీ చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించిన యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాచకొండ భార్గవ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి గీతాంజలి అందించిన గొప్ప నాయకుడు అంటే శ్రీ అని కొనియాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమ ఉధృతంగా కొనసాగడానికి అందెశ్రీ పాటలు ఉద్యమకారులను ఆకట్టుకొని ఉద్యమం వైపు ఆకర్షితుల చేశాయని అన్నారు.అందెశ్రీ ఆశయాలను సాధించాలని పలువురు కోరారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో తన గానం ద్వారా ఉద్యమకారులను తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమం వైవు నడిపించారన్నారు.. ఈ కార్యక్రమంలో జవహర్ బాల్ మంచ కోఆర్డినేటర్ పెద్దగొని రమేష్ గౌడ్, యువజన యువజన కాంగ్రెస్ మునుగోడు అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి చింతల రాజు, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు చౌట లింగస్వామి, మండల ప్రధాన కార్యదర్శి చింతల శివ ప్రసాద్, యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిలు వరకల రాము,ఆవుల రాజు , పబ్బతి వెంకటేష్,మలిగే మల్లేష్,తూర్పునూరి రవి గౌడ్, తూర్పునూరి లింగుస్వామి,ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఉదరి శ్రీనివాస్,బోయ సంపత్,రాజు, ఎన్ ఎస్ యు ఐ మండల అధ్యక్షుడు బోయ నవీన్ , డాకోజు అజయ్,ఎర్ర శ్రవణ్,దిలీప్,తిరుమల్ తదితరులు పాల్గొన్నారు...



# రాచకొండ సతీష్ చారి కుంటుంబానికి నిత్యవసర సరుకులు అందజేత

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి నవంబర్ 11 చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధి లోని లక్కారం గ్రామానికి చెందిన రాచకొండ సతీష్ చారి ఇటీవల మృతి చెందడం జరిగింది.వారి కుటుంబానికి భరోసాని కల్పిస్తూ మానవతా దృక్పథంతో క్వింటాలు బియ్యం,5 కిలోల నూనె అందజేసిన కానుగు బాలరాజు, గుండేబోయిన వెంకటేష్ యాదవ్,ఎస్ కే సయ్యద్ కానుగు శివకుమార్,ఈ కార్యక్రమం లో రాచకొండ చిరంజీవ చారి, వేణు పంతులు, శ్రీధరా చారి, దేశట్ల స్వామి, భాస్కర్ పంతులు గారు పాల్గొన్నారు..

# లాభాల్లో స్టాక్ మార్కెట్లు..

# సెన్సెక్స్ 336, నిఫ్టీ 120 పాయింట్లు



ముంబై, నవంబర్ 11 : దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. ప్రారంభంలో భారీగా నష్టపోయిన సూచీలకు మధ్యాహ్నం తర్వాత అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలతో మదుపరులు కొనుగోళ్లకు మొగ్గుచూపారు. ఐటీ, సర్వీసెస్, టెలికాం రంగ షేర్లలో క్రయవిక్రయాలు జోరుగా సాగడం, అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందం ఖరారు అయ్యే అవకాశాలుండటం కూడా సూచీల్లో జోష్ పెంచింది. ప్రారంభంలో 411 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 335.97 పాయింట్లు అందుకొని 83,871.32 పాయింట్ల వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ సైతం 120.60 పాయింట్లు అందుకొని 25,694.95 వద్ద నిలిచింది. దేశ రాజధాని న్యూఢిల్లీలో ఉగ్రదాడి నేపథ్యంలో మదుపరుల్లో ఆందోళన నెలకొన్నది..ఫలితంగా అమ్మకాలకు మొగ్గుచూపడంతో ప్రారంభంలో తీవ్రంగా నష్టపోయిన సూచీలు చివర్లో గ్లోబల్ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలతో తిరిగి లాభాల్లోకి వచ్చాయని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. ఐటీ, వాహన, మెటల్, ఎఫ్‌ఎంసీజీ రంగ షేర్లు కదంతొక్కాయి. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, ఎటర్నల్, ఇన్ఫోసిస్, భారతీ ఎయిర్‌టెల్, సన్‌ఫార్మాస్యూటికల్స్, లార్సెన్ అండ్ టుబ్రో, హెచ్‌యూఎల్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు లాభాల్లో ముగిశాయి. కానీ, బజాజ్ ఫైనాన్స్, టాటా మోటర్స్, కొటక్ మహీంద్రా బ్యాంక్, పవర్‌గ్రిడ్, టాటా స్టీల్ షేర్లు నష్టపోయాయి. బజాజ్ ఫైనాన్స్ షేరు అత్యధికంగా 7 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది.

## ఈవోడీబీ సంస్కరణల్లో

# తెలంగాణ టాప్

**ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ (ఈవోడీబీ) రీఫార్మ్స్-2024లో తెలంగాణ రాష్ట్రానికి 'టాప్ అచీవర్'గా గుర్తింపు దక్కింది. ఇందుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ ఢిల్లీలో ఈ అవార్డును అందుకున్నారు. పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం(డీపీఐఐటీ) రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను బలోపేతం చేసేందుకు బీఆర్‌ఏపీ-2024 7వ ఎడిషన్‌ను ఇటీవల ప్రారంభించింది. వ్యాపార సౌలభ్యాన్ని పెంపొందించడానికి విస్తృతమైన సంప్రదింపులు, వాటాదారుల అభిప్రాయాల ఆధారంగా రూపొందించిన బీఆర్‌ఏపీ-2024 లో 434 రీఫార్మ్ పాయింట్లు ఉన్నాయి. ఇందులో కార్మిక చట్టాలు, భూ పరిపాలన, ఆస్తి రిజిస్ట్రేషన్, పెట్టుబడి-పర్యావరణ అనుమతుల వంటి అంశాలున్నాయి.**

# పెరిగిన ప్రత్యక్ష పన్ను వసూళ్లు



న్యూఢిల్లీ, నవంబర్ 11 : నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు భారీగా పెరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.12.92 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. కార్పొరేట్ పన్ను వసూళ్లు భారీగా పెరగడం, రీఫండ్‌లు తగ్గుముఖం పట్టడంతో గతేడాది ఇదే సమయంలో వసూలైనదాంతో పోలిస్తే 7 శాతం పెరిగాయని కేంద్ర ప్రభుత్వం తాజాగా వెల్లడించింది. ఏప్రిల్ 1 నుంచి నవంబర్ 10 వరకు రీఫండ్ 18 శాతం తగ్గి రూ.2.42 లక్షల కోట్లకు పరిమితమయ్యాయి. ఇదే కాలంలో కార్పొరేట్ పన్ను వసూళ్లు రూ.5.08 లక్షల కోట్ల నుంచి రూ.5.37 లక్షల కోట్లకు చేరుకున్నాయి. అలాగే కార్పొరేటేతర పన్ను వసూళ్లు రూ.7.19 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. క్రితం ఏడాది ఇదే కాలానికిగాను రూ.6.62 లక్షల కోట్లుగా ఉన్నాయి. సెక్యూరిటీస్ లావాదేవీల పన్ను రూ.35,682 కోట్లు వసూలయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేంద్ర సర్కార్ రూ.25.20 లక్షల కోట్ల ప్రత్యక్ష పన్ను వసూళ్ల లక్ష్యంగా పెట్టుకున్నది.

# భారత్ వైపు.. స్టార్టప్స్ చూపు...

## మన మార్కెట్లో విస్తరణపై సింగపూర్, కెనడా అంకురాల ఆసక్తి భారీ మార్కెట్, అధిక వృద్ధి అవకాశాలే కారణం



న్యూఢిల్లీ: దేశీయంగా భారీ మార్కెట్, వేగవంతమైన ఆర్థిక వృద్ధి తదితర అంశాల కారణంగా పలు అంతర్జాతీయ అంకుర సంస్థలు భారత మార్కెట్లో విస్తరించే యోచనలో ఉన్నాయి. సింగపూర్, కెనడా తదితర దేశాలకు చెందిన స్టార్టప్స్ వీటిలో ఉన్నాయి. హాంకాంగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పార్క్స్ కార్పొరేషన్ (హెచ్‌కేఎస్‌టీపీ) నిర్వహించిన గ్లోబల్ పిచ్ కాంపిటీషన్ 'ఎపిక్ 2025'లో పాల్గొన్న సందర్భంగా పలు విదేశీ అంకుర సంస్థలు భారత్‌పై ఆసక్తి వ్యక్తం చేశాయి. 70 పైగా దేశాలకు చెందిన 100 స్టార్టప్స్ నుంచి ఈ కాంపిటీషన్‌కి సుమారు 1,200 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో భారత్ నుంచి రెండు అప్లికేషన్లు ఉన్నాయి. ఈ దరఖాస్తులను ప్రధానంగా డిజిటల్ హెల్త్ టెక్, ఫిన్‌టెక్, గ్రీన్‌టెక్ అని మూడు కేటగిరీలుగా వర్గీకరించారు. ఎంట్రప్రెన్యూర్లను వర్ధమాన మార్కెట్లు, ఇన్వెస్టర్లు, ప్రపంచ స్థాయి ఆవిష్కరణల వ్యవస్థలకు అనుసంధానం చేసేందుకు ఎపిక్ 2025 తోడ్పడుతుందని హెచ్‌కేఎస్‌టీపీ చైర్మన్ సన్నీ తెలిపారు.

**సానుకూల పరిస్థితులు ఆకర్షణీయం..**

భారత్‌లో స్టార్టప్‌లకు అనువైన వ్యవస్థ ఉందని బ్యాటరీ రీసైక్లింగ్ కార్యకలాపాలు సాగించే సింగపూర్ సంస్థ న్యూ బ్యాటరీ మెటీరియల్స్ చైర్మన్ బ్రయాన్ తెలిపారు. ఇక్కడ భారత్‌లో పెద్ద సంఖ్యలో టూ%-%వీలర్లు, త్రీ%-%వీలర్లతో భారీ మార్కెట్ ఉందని తెలిపారు. బ్యాటరీ రీసైక్లింగ్ వ్యాపారం నిర్వహిస్తున్న స్టార్టప్‌లు మెరుగ్గా రాణిస్తున్నాయని వివరించారు. భారత ప్రభుత్వ విధానాల గురించి మరింత తెలుసుకోవడంపై ఆసక్తిగా ఉన్నట్లు పేర్కొన్నారు. గ్రీన్‌టెక్ కేటగిరీలో న్యూ బ్యాటరీస్ మెటీరియల్స్ విజేతగా నిల్చింది. మరోవైపు, ఏ ఇన్వెస్టరుకైనా భారత్‌లో పెట్టుబడులకు గణనీయంగా అవకాశాలు ఉన్నాయని ఎయిర్ కార్గో సాఫ్ట్‌వేర్ తయారు చేసే సింగపూర్ కంపెనీ 'బెల్లి' ప్రోడక్ట్ ఇంజినీర్ జేడెన్ తెలిపారు. భారత్‌లో అంకురాలకు మంచి భవిష్యత్తు ఉండగలదన్నారు. భారత మార్కెట్లోకి ప్రవేశించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు కెనడాకి చెందిన కేఏ ఇమేజింగ్ ప్రెసిడెంట్ అమోల్ ఎస్ కార్నిక్ చెప్పారు. సైన్స్, మెడికల్ టెక్నాలజీల అభివృద్ధికి భారత ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుండటం తమకు ఒక అవకాశంగా ఉపయోగపడగలదని పేర్కొన్నారు. తమ సంస్థకు అనువైన మరిన్ని విధానాలపై అధ్యయనం చేస్తామని వివరించారు.

# ఓఎఫ్ఎస్ బాటలో ప్రమోటర్లు



న్యూఢిల్లీ: పబ్లిక్ ఇష్యూల్లో భాగంగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) మార్గంలో ప్రమోటర్లు వాటాలను విక్రయించడం గణనీయంగా పెరుగుతోంది. ఈ ఏడాది ఇప్పటివరకు (జనవరి-నవంబర్) వచ్చిన ఐపీవోల్లో విలువపరంగా ఓఎఫ్ఎస్ పరిమాణం సుమారు 65 శాతంగా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. 2023లో ఇది మొత్తం ఐపీవోల్లో 58 శాతంగా, 2024లో 59 శాతంగా నిల్చింది. 2023లో మొత్తం ఐపీవోల్లో (సంఖ్యాపరంగా) 15.8 శాతం ఇష్యూలు పూర్తిగా ఓఎఫ్ఎస్ విధానంలోనే వచ్చాయి. గతేడాది ఈ నిష్పత్తి 15.4 శాతంగా ఉండగా, ఈ ఏడాది 16.5 శాతానికి చేరింది. వ్యాపార విస్తరణ ఇతరత్రా అవసరాల కోసం సదరు ఇష్యూల్లో తాజా షేర్ల జారీ ద్వారా కంపెనీలు కొత్తగా నిధులు సమీకరించలేదు. ప్రమోటర్లు, ఇన్వెస్టర్లే తమ వాటాలను ఓఎఫ్ఎస్ విధానంలో విక్రయించుకున్నారు. 2024లో హ్యుందాయ్, 2025లో ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఈ తరహా మెగా ఐపీవోల జాబితాలో నిల్చాయి. గడిచిన మూడేళ్లలో విలువపరంగా ఓఎఫ్ఎస్ వాటా అత్యధికంగా ఉన్న టాప్ ఐపీవోల్లో విశాల్ మెగా మార్ట్, మ్యాన్‌కైండ్ ఫార్మా, టాటా టెక్నాలజీస్, ఉయ్‌వర్క్ ఇండియా, శాగిలిటీ ఇండియా, ట్రావెల్ ఫుడ్ సర్వీసెస్, సెల్లో వరల్డ్, ఓర్క్‌లా ఇండియా మొదలైనవి ఉన్నాయి. సాధారణంగా ప్రమోటర్లు, బడా సంస్థాగత ఇన్వెస్టర్లు మొదలైన వర్గాలు ఓఎఫ్ఎస్ విధానంలో వాటాలు విక్రయిస్తుంటారు. ప్రస్తుతం ఆఫర్ ఫర్ సేల్ విధానంలో అత్యధికంగా ప్రమోటర్లే విక్రయించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. 2025లో వచ్చిన ఇష్యూలకు సంబంధించి ఓఎఫ్ఎస్ ద్వారా ప్రమోటర్లు సేకరించిన నిధులు (విలువపరంగా) 68.5 శాతంగా నమోదైంది. 2023లో ఈ నిష్పత్తి 52.8 శాతంగా నిల్చింది. పూర్తిగా ఓఎఫ్ఎస్ రూపంలోనే వచ్చిన టాప్ ఐపీవోల జాబితాలో హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్, హెక్సావేర్ టెక్నాలజీస్, ష్లాస్ బెంగళూరు, విక్రమ్ సోలార్, బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్, ఆఫ్కాన్స్ మొదలైనవి ఉన్నాయి. పబ్లిక్ ఇష్యూల్లో ఓఎఫ్ఎస్ వాటా పెరుగుతుండటమనేది దేశీ క్యాపిటల్ మార్కెట్ వ్యవస్థ పరిపక్వ స్థాయికి చేరుతున్న సంకేతంగా భావించవచ్చని ప్రైమ్ డేటాబేస్ వర్గాలు తెలిపాయి. 1990లు, 2000ల ప్రాంతంలో చాలా మటుకు ఐపీవోలు తాజాగా పెట్టుబడులు సమీకరించాయని, అలాంటి కంపెనీల పరిస్థితి ఏమైందనేది అందరికీ తెలిసిందేనని వ్యాఖ్యానించాయి. ఇక పెద్ద సంఖ్యలో ప్రమోటర్లు ఓఎఫ్ఎస్ బాట పడుతున్నప్పటికీ, ఆయా కంపెనీల్లో వారి పెట్టుబడులు తప్పనిసరిగా నిర్దిష్ట స్థాయిలో ఉండేలా చూసేందుకు స్పష్టమైన నిబంధనలు ఉన్నాయని పేర్కొన్నాయి. అయితే, ఐపీవోల తర్వాత ప్రమోటర్లు బల్క్, బ్లాక్ డీల్స్ కుదుర్చుకునే ధోరణి పెరుగుతోందని, ఇన్వెస్టర్లు దీనిపై ఓ కన్నేసి ఉంచాలని పరిశ్రమ వర్గాలు వివరించాయి. మరోవైపు, ఐపీవో పూర్తిగా ఓఎఫ్ఎస్ రూపంలో ఉన్నంత మాత్రాన ప్రతికూలాంశంగా భావించనవసరం లేదని తెలిపాయి. ప్రైవేట్ ఈక్విటీ, వెంచర్ క్యాపిటల్ ఫండ్స్ పెట్టుబడులు ఉన్న సంస్థల్లో ఇది సాధారణమేనని వివరించాయి. ప్రారంభ దశలో రిస్క్ క్యాపిటల్ భారీగా అవసరం అవుతుందని, ఆ నిధులను సమకూర్చిన పీఈ, వీసీలు తర్వాత దశలో ఐపీవోల్లో ఓఎఫ్ఎస్ కింద వాటాలను విక్రయించుకుంటాయని పేర్కొన్నాయి.